నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 2 డిసెంబర్ 2024 | HYDERABAD

మోస్తరు వాన

సిటీబ్యూరో: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో ఆదివారం గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. సికింద్రాబాద్ అడ్డగుట్ట, మల్కాజిగిరి, హయత్‌నగర్, ఉప్పల్, నాగోల్, బంజారాహిల్స్, రాజేంద్రనగర్, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో 5 మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. తుఫాను ప్రభావంతో రాగల మరో రెండు రోజులు నగరంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశమున్నట్లు అధికారులు వెల్లడించారు.

మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నేత, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి ఇతర నేతలు

గురుకులాల నిండా సమస్యలే..

12 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గురుకులాలు తన ప్రభను కోల్పోతున్నాయి. సరిపడా వసతుల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే సదుద్దేశంతో గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి.. అవసరమైన నిధులను విడుదల చేసి, వాటి అభ్యున్నతికి కృషి చేస్తే.. ప్రస్తుత రేవంత్ సర్కార్‌లో వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని.. ఇందుకు రాష్ట్రంలోని గురుకులాల్లో జరుగుతున్న ఘటనలే నిదర్శనమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)

విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బృందం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

సంక్షేమ వసతి గృహాల్లో దయనీయ పరిస్థితి

మరుగుదొడ్లు, మూత్రశాలలూ సరిగ్గాల్లేవ్..

విద్యార్థులు పురుగులన్నం తినలేకపోతున్నారు..

కుళ్లిన కూరగాయలు..నాసిరకం భోజనం..

ప్రభుత్వ నిర్లక్ష్యం, కొరవడిన అధికారుల పర్యవేక్షణ

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు గురుకుల పాఠశాలలను సందర్శించిన బీఆర్ఎస్ బృందం

విద్యారంగంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదు..

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ప్రవీణ్‌కుమార్ బృందం హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోని పలు రెసిడెన్షియల్ హాస్టళ్లను సందర్శించింది. విద్యార్థులకు అందుతున్న భోజనం, అక్కడి వసతులు, సౌకర్యాలను చూసి ఆవేదన వ్యక్తం చేసింది. విద్యార్థులు తమ సమస్యలను వారికి వివరించారు. పురుగుల అన్నం తినలేకపోతున్నామని, సబ్బులు, షాంపులు ఇవ్వడంలేదని, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి అరకొరగా వస్తున్న నిధులతో కుళ్లిన కూరగాయలతో తమకు నాసిరకం భోజనం పెడుతున్నారని.. ఆ అన్నం తిని రోగాల బారిన పడుతున్నామని బోరున విలపించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రేవంత్ సర్కారు వచ్చినప్పటి నుంచి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని.. కనీసం వారికి నాణ్యమైన భోజనం అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. విద్యారంగంపై ప్రభుత్వానికి శ్రద్ధ లేకపోవడం.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల పరిస్థితి అత్యంత బాధాకరంగా ఉన్నదన్నారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను బీఆర్ఎస్ పార్టీ ఎక్కడికక్కడ వెలుగులోకి తీసుకొస్తుంటే..సీఎం రేవంత్ మాత్రం మంత్రులతో అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. హాస్టళ్ల సమస్యలను రాజకీయ కోణంలో చూడొద్దని.. సమస్య మూలాలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. గురుకులాల్లో లెక్చరర్లు సరిగ్గా లేరని అనేక చోట్ల భవనాలే లేవని.. మరుగుదొడ్లు, మూత్రశాలల్లేక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. బెడ్లు లేక, కప్పుకొనేందుకు దుప్పట్లు కూడా ఇవ్వలేదన్నారు. నేటికీ స్పోర్ట్స్ మెటీరియల్ లేక విద్యార్థులు క్రీడల్లో వెనుకబడిపోయారన్నారు. హయత్‌నగర్‌లోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, శేరిగూడలోని రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, ఇబ్రహీంపట్నం నల్లకుంటలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలను బీఆర్ఎస్ బృందం పరిశీలించింది. ఇందులో గెల్లు శ్రీనివాస్, ఎర్రొళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ కృపేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, రాజు, అరవింద్, ప్రవీణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో పారుతున్న మురుగును పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బృందం

గురుకులాల్లో అనారోగ్య పరిస్థితులు

బీఆర్ఎస్ నేత మధుకర్‌రెడ్డి

మేడ్చల్, డిసెంబర్ 1 : కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో అనారోగ్య పరిస్థితులు దాపురించాయని బీఆర్ఎస్ నేత, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన బీఆర్ఎస్‌వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ నేతలు మూడుచింతపల్లి మండలం జగన్‌గూడలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ రాష్ట్రంలోని పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 1000 గురుకుల పాఠశాలలను స్థాపించి, నాణ్యమైన విద్యను అందించారని తెలిపారు. కాంగ్రెస్ ఆ లక్ష్యాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాల్లో విద్యార్థులకు సీట్లు దొరకని పరిస్థితులు ఉంటే, కాంగ్రెస్ హయాంలో విద్యార్థులకు ఆస్పత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితులు వచ్చాయన్నారు. విష పూరిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థతకు గురవుతున్నారని, కొంత మంది విద్యార్థులు చనిపోతున్నారన్నారు. మూడుచింతపల్లి మండలంలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో కూడా అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మూడుచింతపల్లి, శామీర్‌పేట మండలాల మండల ప్రధాన కార్యదర్శులు అనిల్ రెడ్డి, పవన్ ముదిరాజ్, నాయకులు మహేశ్ నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంతానికి పోయి...

దుండిగల్, డిసెంబర్1: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఏర్పాటైన కొత్తలో కార్పొరేషన్ పరిధిలోని మూడు జంక్షన్లను బ్యూటిఫికేషన్ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అప్పట్లో రూ.20 లక్షలను కేటాయించారు. అయితే మిగతా రెండు చోట్ల కాదని ప్రగతినగర్‌లోని బతుకమ్మ కుంట వద్ద గ్లోబల్ మ్యాపు వంటి ఓ ఆకృతి (గ్లోబల్ ఐడల్)ని ఆరు నెలల కిందట ఏర్పాటు చేశారు. కనీసం రూ.3 లక్షలు కూడా ఖర్చు చేయని ఈ ఆకృతి..ఏర్పాటు కోసం రూ.12 లక్షలను ఖర్చు చేశారు.అయితే అప్పటికే కార్పొరేషన్ ఖజానా నిండుకోవడంతో ఆ ఆకృతి అవసరం లేదని పాలకవర్గం సభ్యులు ఎంతచెప్పినా.. వినని ఎస్ఈ.. తన పంతం నెగ్గించుకునేందుకు ఆ ఆకృతిని ఏర్పాటు చేశారు. అది కూడా తనకు నచ్చిన ఓ గుత్తేదారికి కొటేషన్‌పైనే పనులు అప్పగించారు. తీరా చూస్తే బతకుమ్మఘాట్ వద్ద ఆ ఆకృతి ఏర్పాటుతో తీవ్ర అంతరాయం కలుగుతుందని ఇటీవల తొలగించారు. ప్రస్తుతం ఆ ఆకృతి ఎందుకు పనికిరాకుండా కార్పొరేషన్ కార్యాలయం మైదానంలో మూలనపడేశారు.

ప్రభుత్వ భూముల సర్వే పూర్తి

మేడ్చల్, డిసెంబర్1 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూముల సర్వేను పూర్తి చేశారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ భూముల లెక్కను రెవెన్యూ యంత్రాంగం తేల్చినట్లు అధికారులు తెలిపారు. భూముల వివరాలను కేఎంఎల్ మ్యాప్(గూగుల్)లో పొందుపర్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా గత రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న 5,195 ఎకరాల ప్రభుత్వ భూమి ఇప్పుడు చేసిన సర్వే ప్రకారం అంతే లెక్కకు వచ్చిందా లేదా అన్నది అధికారుల నివేదికలో నిక్షిప్తమై ఉంది. అయితే గత రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న భూములకు ఇప్పుడు చేసిన సర్వేకు పొంతన లేకుండా ఉండటం వల్లే గోప్యంగా ఉంచుతున్నారు. కాగా ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆక్రమణలను గుర్తించి నివేదికలను స్థానిక తహసీల్దార్లు సిద్ధం చేశారు.

సర్కారు భూములకు ఫెన్సింగ్..

జిల్లాలోని ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్‌లతో పాటు సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బోర్డుల ఏర్పాటుకు అయ్యే ఖర్చుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. గూగుల్ మ్యాప్‌లో పొందు పరిచేకంటే ముందే ఫెన్సింగ్ చేసి ప్రభుత్వ సూచిక బోర్డుల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే కబ్జాకు గురైన భూముల వివరాల నివేదికలను సిద్ధం చేసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అందజేశారు.

మద్యం మత్తు.. ఆపై అతివేగం

మూడు బైక్‌లు, ఆటోను ఢీకొట్టిన కారు

ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతుల దుర్మరణం

మరో నలుగురికి గాయాలు..

తల్లిదండ్రుల మృతితో అనాథలైన ఇద్దరు పిల్లలు

మెహిదీపట్నం: మద్యం మత్తు ఆపై అతివేగం.. అదుపు తప్పిన కారు.. విధ్వంసం సృష్టించింది. ఓ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఇంటి నుంచి పిల్లల కోసం ఆహారం తెద్దామని బయటకు వచ్చిన దంపతులు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో నలుగురికి గాయాలయ్యాయి. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ నుంచి మెహిదీపట్నం వైపు వేగంగా వెళ్తున్న కారు.. దర్గా సమీపంలోకి రాగానే అదుపు తప్పి మూడు బైక్‌లను, ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లంగర్‌హౌస్ గొల్లబస్తీలో నివసించే దినేశ్(35), అనితా ఠాకూర్ (35) దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. లంగర్‌హౌస్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మార్చురీ తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా, లంగర్‌హౌస్ గొల్లబస్తీలో నివసించే అనితా ఠాకూర్, దినేశ్ దంపతులు తమ ఇద్దరు పిల్లలు ప్రేరణ శ్రీ(12), దితి శ్రీ(10)తో కలిసి నాలుగు రోజుల కిందట గోవాకు వెళ్లి..శనివారం రాత్రి తిరిగి వచ్చారు. అయితే దంపతులు పిల్లలకు రాత్రి భోజనం తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై బయటకు వచ్చారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యానికి బలయ్యారు. తల్లిదండ్రుల మృతితో వారి పిల్లలు అనాథలయ్యారు.

రాత్రి ఎనిమిదయ్యిందంటే..

సిటీబ్యూరో: రోడ్లపై రయ్యిమంటూ వేగంగా వెళ్లే వాహనాలు... ఒకరు తాగి వేగంగా నడిపితే.. మరొకరు నిర్లక్ష్యంగా డేంజరస్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఇలాంటి వాళ్లను కట్టడి చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు రాత్రి 8 అయ్యిందంటే రోడ్లపై కనిపించరు. ఇంకేముంది రోడ్లపై డేంజరస్ డ్రైవింగ్ చేసేవాళ్లతో అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. లంగర్‌హౌస్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులను మద్యం మత్తులో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో వారు మృతి చెందారు. ఆ రూట్‌లో శనివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ జరిగి ఉంటే ప్రమాదం సంభవించేది కాదు. కనీసం ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై కనిపించినా.. ఉల్లంఘనదారుల్లో భయం అనేది ఉండేది.

కలవరపెడుతున్న కల్తీ..!

ధనార్జనే ధ్యేయంగా హోటల్ నిర్వాహకుల బిజినెస్

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు

బల్దియాకు ఫిర్యాదుల వెల్లువ

జీహెచ్ఎంసీకి రోజూ 20 ప్రాంతాల నుంచి ఫిర్యాదులు

గడిచిన 10 నెలల్లో 9,886 హోటళ్లలో తనిఖీలు..1588 నోటీసులు, జరిమానాలు

కల్తీ నివారణకు కఠిన శిక్షలు అమలు చేయాలంటున్న నగరవాసులు

సిటీబ్యూరో, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : కల్తీ వ్యవహారం గ్రేటర్‌ను కుదిపేస్తోంది. చిన్న హోటళ్లే కాదు పేరొందిన రెస్టారెంట్లలోనూ భయానక వాస్తవాలు రోజుకో చోట బయటపడుతున్నాయి. నియమ, నిబంధనలను పక్కన పెట్టేసి ధనార్జనే ధ్యేయంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వంట గదులు పరిశుభ్రత పాటించడం లేదు..ఫుడ్ తయారీలో ప్రతిదీ కల్తీ వస్తువులను వాడుతున్నారు. పైగా పాచిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్‌లో పెట్టి తిరిగి వేడి చేసి పెడుతున్నారు. మాంసం అయితే రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టి దానికి మాసాలాలు దట్టించి మరుసటి రోజు వాడుతున్నారు. బిర్యానీలో బొద్దింకలు, వెంట్రుకలు వస్తున్న సందర్భాలు లేకపోలేదు.. ఈ జాబితాలో చిన్న హోటళ్లు నుంచి బడా హోటళ్ల నిర్వాహకులు ఉంటున్నారు. తరచుగా జీహెచ్ఎంసీకి నిత్యం దాదాపు 20 వరకు పైగా ఫిర్యాదులు ఇలాంటివే ఎక్కువగా వస్తున్నాయి. ఇందులో భాగంగానే గడిచిన కొన్ని నెలలుగా ఫుడ్ సేఫ్టీ, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లపై విస్తృత తనిఖీల్లో ఆహార కల్తీకి అడ్డూ అదుపు లేకుండా పోతుందని , ఏ మాత్రం శుభ్రత, నాణ్యతల లేమి బయటపడుతున్నాయి. గడిచిన పది నెలల వ్యవధిలో 9,886 హోటళ్లలో తనిఖీలు చేయగా, 1588 వాటికి అధికారులు నోటీసులు జారీ చేశారు. 68 హోటళ్లు ప్రమాదకరం, 12 తీవ్ర హానికరమని తేల్చారు. ఆహార పదార్థాల్లో కల్తీ కేదీ కాదు అనర్హం అన్న చందంగా ఈ తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా భారీ పెనాల్టీలు, మూసివేతలు, తగిన శిక్షణ అమలు కాకపోవడం ఓ కారణం కాగా, లంచాలకు మరిగిన అధికారులపై చర్యలు లేకపోవడంతో మరో కారణంగా కనిపిస్తున్నది.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

గ్రేటర్‌లో దాదాపు 12 నుంచి 14 వేల వరకు హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. ఆయిల్ నుంచి మొదలు ఉప్పు దాకా నాణ్యమైన వాటిని వినియోగించి నిర్వాహకులు క్వాలిటీ ఫుడ్‌ను అందించాలి. కానీ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం హోటళ్లు, హాస్టల్స్, క్యాంటీన్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, చైనీస్ ఫుడ్ సెంటర్లు..ఫుడ్ వ్యాపారం ఏదైనా.. నిర్వాహకులు వంటగది లోపలి భాగం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి. డ్రైనేజీ వసతి బాగుండాలి.

అమలు కానీ కఠిన శిక్షలు

పరిరక్షణ లేని ఆహారాన్ని ఎవరు తయారు చేసినా, అమ్మినా, నిల్వ చేసినా, సరఫరా చేసినా ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ 2006 చట్టం ద్వారా శిక్షతో పాటు జరిమానా విధిస్తారు. అనుమతి లేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ. లక్ష వరకు జరిమానా వేస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష, రూ. 3 లక్షల వరకు పెనాల్టీ ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురి చేసే ఆహార పదార్థామైతే ఆరు నెలల జైలు శిక్ష, రూ. 5లక్షల వరకు జరిమానా వేస్తారు.

గడిచిన పది నెలల్లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ వివరాలు

నిర్వహించిన తనిఖీలు	9,886
జారీ చేసిన నోటీసులు	1,588
సేకరించిన శాంపిల్స్	1,797
శాంపిల్స్ మేరకు ఉల్లంఘనులు	68
సురక్షితం కానివి	12

సర్వం కల్తీమయం

- ఆహార పదార్థాల్లో ప్రకృతి సిద్ధమైన రంగులే వాడాలి.
- ఆహార పదార్థాల తయారీకి టేబుల్ సాల్ట్ (చైనా సాల్ట్) వాడకూడదు. రోజు వారీ వాడే ఉప్పునే వాడాలి. కానీ ఈ నిబంధనలను చాలా మంది బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు పాటించడం లేదు.
- పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పొడర్లు , యూరియా, పిండి, నూనె, నీళ్లు కలిపి విక్రయిస్తున్నారు.
- రంపపు పొట్టును టీ పొడిలో కలపడం వల్ల ఊపిరితిత్తులు పాడైపోయే ప్రమాదం ఉంది.
- జంతువులు కళేబరాల నుంచి సేకరించిన ఎముకలను బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి తీసిన ద్రావణాన్ని వంట నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీంతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఆరోగ్యకరమైన జంతువు మాంసాన్ని 24 గంటల్లోపే వినియోగించాలి. చాలా హోటళ్లలో చనిపోయిన జంతువుల మాంసాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయిస్తున్నారు.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లలో కస్టమర్లను ఆకట్టుకునేందుకు ఎక్కువగా హానికర రంగులు వాడుతున్నారు.
- చిన్న, చిన్న హోటళ్లు, కర్రీపాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగిపోయి తిన్న తర్వాత అనారోగ్యాన్ని కలిగిస్తాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులలో ఆరటి గుజ్జు, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌ను కలుపుతున్నారు.
- అన్ని రకాల పండ్లను ఆకర్షణీయంగా కనిపించేందుకు కార్బైడ్ హానికారక రంగులు, జిగురు యథేచ్ఛగా వాడుతున్నారు. దీంతో కాలేయ సమస్యలు, కడుపునొప్పి, నిద్ర లేమి , కిడ్నీ వంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. కాగా బయటి ఆహారం తినడంతో చాలా రోగాలు వచ్చే అవకాశాలున్నాయని, వీలైనంత వరకు తగ్గించుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వాడిన నూనెనే మళ్లీ వాడడం ద్వారా కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం , అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయని చెబుతున్నారు.